
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి





జగ్గారెడ్డి ఆధ్వర్యంలో మహా పడిపూజ

● అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన సంగారెడ్డి ● వేలాదిమందికి మహా అన్నదానం ● భజన, నృత్యాలతో ఉత్సాహం నింపిన జగ్గారెడ్డి





అయ్యప్పస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న జగ్గారెడ్డి, సతీమణి నిర్మల, కుమార్తె జయారెడ్డి, కుమారుడు దత్తు సాయిరెడ్డి, మహా పడిపూజలో భజన పాటలు పాడుతున్న జగ్గారెడ్డి

సంగారెడ్డిటౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి నివాసంలో మంగళవారం అయ్యప్ప స్వామి మహా పడి పూజ ఘనంగా జరిగింది. అంతకుముందు జగ్గారెడ్డి సతీమణి టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డితో కలిసి సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. అయ్యప్ప స్వామి మహాపడి పూజకు వేలాదిమంది అయ్యప్ప భక్తులు, మహిళలు తరలివచ్చారు. ఆ ప్రాంతమంతా అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. అయ్యప్ప భక్తులతో కలిసి భజన పాటలు, నృత్యాలతో జగ్గారెడ్డి ఉత్సాహం నింపారు. భక్తులకు మహా అన్నదాన వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ ప్రత్యేక పూజల్లో జగ్గారెడ్డి కుమార్తె జయారెడ్డి, కుమారుడు దత్తు సాయిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కళాకారులు పాల్గొన్నారు.



జగ్గారెడ్డి నివాసం వద్ద జరిగిన మహా పడిపూజకు హాజరైన అయ్యప్ప స్వాములు

అరుణ కిరణం



అప్పుడే ఉదయిస్తున్న భానుడి లేలేత కిరణాలు చెరువులో ప్రతిబింబిస్తుండగా.. ఓ వ్యక్తి పడవను నడుపుకుంటూ వెళ్తున్న దృశ్యాలు.. హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువులో మంగళవారం కనువిందు చేశాయి. ఎల్లమ్మ చెరువు కాకతీయుల కాలం నాటి పెద్ద తూము వద్ద మబ్బులో ఏర్పడిన అరుణ వర్ణం చూపరులను ఆకట్టుకుంది.

- హుస్నాబాద్, డిసెంబరు 31

పారితోషికం ఎప్పుడో?

● కుటుంబ సర్వేలో విధులు నిర్వర్తించిన వారికి నెల దాటినా చెల్లించని వైనం

● ఆశగా ఎదురుచూస్తున్న ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు



సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి (ఫైల్)

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో విధులు నిర్వర్తించిన ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఇంకా పారితోషకం అందలేదు. సర్వే ప్రారంభానికి ముందే ప్రభుత్వం జిల్లాకు రూ.2.90 కోట్ల నిధులు మంజూరు చేసింది. సర్వే ప్రక్రియ ముగిసి నెల గడిచినా నేటికీ పారితోషకాలు చెల్లించకపోవడంతో వారికి నిరీక్షణ తప్పడంలేదు.

జిల్లాలో 2302 మంది ఎన్యూమరేటర్లు

రాష్ట్ర ప్రభుత్వం కుల, ఇంటింటి సర్వేకు శ్రీకారం చుట్టింది. సమగ్ర సర్వే చేసేందుకు జిల్లావ్యాప్తంగా 2,302 మంది ఎన్యూమరేటర్లుగా నియమించారు. వీరంతా నవంబరు 9 నుంచి 25 వరకు తమకు కేటాయించిన సంఖ్యకు అనుగుణంగా ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. కుటుంబాల వివరాలను సేకరించి సమాచారాన్ని ప్రత్యేక ఫాంలో నమోదు చేశారు. ఈ సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు మండల స్థాయి అధికారులను 230 మంది సూపర్‌వైజర్లుగా నియమించారు. ఎన్యూమరేటర్లు చేసిన సర్వే ఫాంలను పరిశీలించి రోజువారీగా జరిగిన సర్వే వివరాలను సూపర్‌వైజర్లు ఉన్నతాధికారులకు నివేదించారు. అలాగే సర్వే వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేసేందుకు తాత్కాలికంగా దాదాపు 450 మందిని డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించారు.

పెండింగ్‌లో పారితోషికాలు..

సర్వే నిర్వహించిన ఎన్యూమరేటర్‌కు రూ.10 వేలు, సూపర్‌వైజర్‌కు రూ.12వేల చొప్పున, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఒక్కో ఫారం నమోదు చేసినందుకు గాను రూ.25 చొప్పున చెల్లించాలని నిర్ణయించింది. ఈ సర్వే ప్రారంభానికి ముందే ప్రభుత్వం జిల్లాకు రూ.2.90 కోట్ల మంజూరు చేసింది. సర్వే ఫారాల ముద్రణ నుంచి పారితోషికాల చెల్లింపు వరకు ఈ నిధులు వినియోగించాలని సూచించింది. అయితే సర్వేతో పాటు డేటా ఎంట్రీ ప్రక్రియ ముగిసి నెల దాటినా జిల్లాలో వాటి చెల్లింపులు జరగలేదు. తమకు పారితోషికాలు ఎప్పుడు అందుతా యో.. అని ఎన్యూమరేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. వాటిని త్వరగా చెల్లించేలా చూడాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు. ఈ విషయమై సీపీవోను ఆంధ్రజ్యోతి వివరణ అడగ్గా వారం రోజుల్లో నేరుగా వారి ఖాతాల్లో జమచేస్తామని చెప్పారు.

నయా జోష్..

● ఘనంగా న్యూఇయర్ వేడుకలు ● ఆడిపాడిన యువత

● భారీగా కేకుల కొనుగోళ్లు.. మాంసం, మద్యం దుకాణాలు కిటకిట



సిద్దిపేటలో కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న బేకరీ

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో న్యూ ఇయర్ జోష్ నెలకొన్నది. నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. పాత సంవత్సరానికి వీడ్కోలు.. కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు కొందరు రిసార్టు, పబ్బుల్లో ఎంజాయ్ చేసేందుకు వెళ్లారు. కాలనీలు, అపార్ట్‌మెంట్‌లలో న్యూఇయర్ వేడుకలు నిర్వహించడంతో చిన్నారులు, యువత, మహిళలు ఆటపాటలతో సందడి చేశారు. సౌండ్ సిస్టం ఏర్పాటు చేసుకుని డ్యాన్సులు చేస్తూ హుషారుగా గడిపారు. న్యూ ఇయర్ సందర్భంగా బేకరీలలో ప్రత్యేక ఆఫర్లు పెట్టారు. కేక్ తీసుకుంటే కూల్‌డ్రింక్ ఫ్రీ అంటూ ఆఫ్ కేజీ, కేజీ కేక్‌లతో ప్యాకేజీలు పెట్టారు. దీంతో కేక్‌ల విక్రయాలు జోరుగా సాగాయి. హోటల్స్ రెస్టారెంట్స్ నాన్ వెజ్ మెనూను స్పెషల్‌గా పెట్టి కాంబో ఆఫర్స్‌తో జనాలను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. మహిళలు, యువతులు ఇళ్ల ముందు రంగవల్లులు తీర్చిదిద్దారు. వైన్సులు సాయంత్రం నుంచే కిటకిటలాడాయి. బార్‌లకు రాత్రి 1 గంట వరకు అనుమతి ఇచ్చారు. మరోవైపు పట్టణంలో పలుచోట్ల డ్రంకెన్ డ్రైవ్ ఏర్పాటు చేశారు.

ఈ ఏడాదికి ఇవి ఫిక్సవుదాం...

2024కి గుడ్‌బై చెప్పి.. 2025 సంవత్సరానికి గ్రాండ్ వెల్‌కం చెప్పేశాం.. గతేడాది చేద్దామని మొదలు పెట్టని, మధ్యలోనే ఆపేసిన పనులు, లక్ష్యాలను ఈ ఏడాదిలో పూర్తి చేద్దాం..

నో ఆల్కాహాల్, నో స్మోకింగ్..

చాలా మంది చాలాసార్లు మందు ముట్టను, సిగరెట్ కాల్చను అని చెప్పి.. మాటతప్పినవారే ఎక్కువ. ఈ ఏడాది అలా మాటతప్పకుండా ఆ రెండు అలవాట్లకు దూరంగా ఉంటే ఎన్నో అనారోగ్య సమస్యల నుంచి బయటపడొచ్చు. ఈ ఏడాది ఉదాసీనంగా ఉండకుండా వీటికి దూరం ఉండే ప్రయత్నం చేద్దాం.

కొంత పొదుపు..

లెక్కాపత్రం లేకుండా చేసే ఖర్చు ఎప్పటికైనా ప్రమాదమే.. కాబట్టి వచ్చే జీతంలో, ఆదాయంలో కొంత మొత్తాన్ని పొదుపు చేయడం అలవాటు చేసుకుందాం. బ్యాంకు, పోస్టాఫీసు వంటి వాటిలో జమ చేయటం అలవాటుగా మారాలి.

ఆరోగ్యంతో పాటు.. ఫ్యూచర్ ప్లానింగ్..

ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి క్రమశిక్షణతో కూడిన డైట్ అవసరం. ఉదయం మార్నింగ్ వాక్ దగ్గర నుంచి మొదలు పెడితే సాయంత్రం బయట తినే జంక్ ఫుడ్ వరకు స్వీయ నియంత్రణ అవసరం. నేటి నుంచి వాకింగ్, హెల్దీఫుడ్ తీసుకునేలా ప్లాన్ చేసుకుందాం. అలాగే సోషల్ మీడియాకు, ఫోన్‌లకు వీలైనంత వరకు దూరంగా ఉండే ప్రయత్నం చేద్దాం. లైఫ్‌లో గోల్ సెట్టింగ్, లక్ష్యం లేకుండా ఉండడం కూడా ప్రమాదమే. ఒకవేళ ఇప్పటి వరకు ఎలాంటి లక్ష్యం లేకుండా ఉంటే వెంటనే గోల్ ఏర్పరుచుకుని అందుకనుగుణంగా పనిచేద్దాం.

సామాజిక బాధ్యత..

మంచి పని చేయడానికి ముహూర్తం అవసరం లేదు.. కాబట్టి ఈ రోజు నుంచే సామాజిక బాధ్యతగా సేవా కార్యక్రమాల్లో భాగమవుదాం. తోటివారికి చేయూతనందిద్దాం.







సేవలకు గుర్తింపు

● ఒకరికి ఉత్తమ సేవ..

ఇద్దరికి సేవ పతకం



హైమద్ ఆలీ



రవీందర్‌రెడ్డి



మల్లేశ్వరరావు

సిద్దిపేట క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ సేవా పథకాలకు సిద్దిపేట జిల్లా నుంచి ముగ్గురు పోలీసు అధికారులు ఎంపికయ్యారు. ములుగు పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న మన్నె రవీందర్‌రెడ్డికి ఉత్తమ సేవ, సిద్దిపేట హెడ్‌క్వార్టర్‌లో ఏఆర్ ఎస్సై సీఏఆర్‌గా విధులు నిర్వహిస్తున్న సయ్యద్ హైమద్ ఆలీ, సిద్దిపేట హెడ్‌క్వార్టర్‌లో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తున్న మల్లేశ్వరరావు సేవా పతకానికి ఎంపికయ్యారు.

మల్లన్న ఆలయ ఈవోగా రామాంజనేయులు

చేర్యాల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ ఈవోగా కె.రామాంజనేయులు నియమితులయ్యారు. దేవాదాయశాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. నాలుగేళ్లక్రితం హైదరాబాద్ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ బాలాజీశర్మకు మల్లన్న ఆలయ పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన పదవీ కాలం మంగళవారంతో ముగియడంతో దేవాదాయశాఖ ఉన్నతాధికారులు కమిషనర్ కార్యాలయ గెజిటెడ్ సూపరింటెండెంట్ కె.రామాంజనేయులును నియమించారు. నేడే, రేపో రామాంజనేయులు విధులలో చేరనున్నారు.

సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో మనీషాకు బంగారు పతకం 8

రూ.15.95 లక్షల విలువైన
ఆల్ప్రాజోలం పట్టివేత



చిరాగ్‌పల్లి చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ అధికారులు పట్టుకున్న కారులోని ఆల్ప్రాజోలం, సిరఫ్‌లు

- 150 నిషేధిత సిరఫ్ బాటిళ్లు స్వాధీనం
- 40 లక్షల విలువైన కారు సీజ్, ఇద్దరు నిందితుల అరెస్టు

జహీరాబాద్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి) : కర్ణాటక నుంచి హైదరాబాద్‌కు కారులో తరలిస్తున్న రూ.15.95 లక్షలు విలువ చేసే ఆల్ప్రాజోలం పట్టుకున్నామని మెదక్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. మంగళవారం సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని మాడ్గి శివారులోని ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద మెదక్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన ఎండీ అస్లాం, ఎండీ అలీంఖాన్ కర్ణాటక నుంచి రూ.40 లక్షల విలువ చేసే కారులో వస్తుండగా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కారును నిలిపి తనిఖీ చేశారు. కారులో రూ.15.95 లక్షలు విలువ చేసే 7,500 ఆల్ప్రాజోలం ట్యాబ్లెట్లు, రూ.28 వేలు విలువ చేసే 150 నిషేధిత కొడినెట్ సిరఫ్ బాటిళ్ల బయటపడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేశారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి విచారించగా హైదరాబాద్‌లోని మాసాబ్‌ట్యాంకు ప్రాంతంలో అనుమతిలేని మెడికల్ దుకాణాలకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. ఆల్ప్రాజోలం ట్యాబ్లెట్లు, నిషేధిత సిరఫ్‌ను పట్టుకున్న సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ యాదయ్య, ఎక్సైజ్ పోలీసులు సతీష్, రామారావునాయక్, ప్రహ్లాద్‌రెడ్డి, వివేక్, ఖరీంను, ఎక్సైజ్ పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

గుమ్మడిదలలో రూ.3.50 లక్షల విలువైన..

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా రవాణా చేస్తున్న రూ.3.50 లక్షల విలువ చేసే 350 గ్రాముల ఆల్ప్రాజోలంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌కు చెందిన డొల్లారి సాయిలుగౌడ్ అలియాస్ రాజు(51) గుమ్మడిదల టోల్‌ప్లాజా వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా సీసీఎస్ జిల్లా పోలీసులు, గుమ్మడిదల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రూ.3.50లక్షల విలువైన 350 గ్రాముల ఆల్ప్రాజోలంను స్వాధీనం చేసుకున్నారు. సాయిలుగౌడ్ గడిపెద్దాపూర్‌లో కల్లు డిపోను లీజుకు తీసుకుని వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో అతని చిన్న నాన్న అయిన లింగన్నగారి నారాయణమూర్తి, పుల్కల్ మండలం ముదిమాణిక్యంకు చెందిన అశోక్‌గౌడ్ ఆల్ప్రాజోలంను సాయిలుకు ఇచ్చారు. దాన్ని తీసుకొని సాయిలు మంగళవారం బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తుండగా గుమ్మడిదల టోల్‌ప్లాజా వద్ద సీసీఎస్, గుమ్మడిదల పోలీసులు పట్టుకున్నారు. అనంతరం నారాయణమూర్తి, అశోక్‌గౌడ్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా పటాన్‌చెరుకు చెందిన ఓ గుర్తు తెలియని వ్యక్తి పరారీలో ఉన్నాడని, అతడిని త్వరలో పట్టుకుంటామని ఎస్పీ రూపేష్ తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, జిన్నారం సీఐ నయీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు తెలుపుతున్న ఎస్పీ

భూనిర్వాసితుడి ఆత్మహత్యాయత్నం

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట పురుగుల మందు తాగేందుకు ప్రయత్నం

అక్కన్నపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణంలో భూమి కోల్పోయి ఐదేళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ఓ భూనిర్వాసితుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం కలకలం సృష్టించింది. తహసీల్దార్ కార్యాలయం వద్దకు పురుగుల మందు డబ్బాతో వచ్చిన రైతు నుంచి తహసీల్దార్ అనంతరెడ్డి, పోలీసు పురుగుల మందు డబ్బాను లాక్కున్నారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామానికి చెందిన నందారపు సంపత్ అనే రైతుకు తన తన తండ్రి వారసత్వంగా వచ్చిన భూమి ఉంది. సర్వే నంబర్ 491/8లో 1.10 ఎకరాల భూమి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తన తండ్రి అయిన నందారపు వెంకటయ్యకు ఇచ్చారని తెలిపారు. ఈ భూమి గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైందని పేర్కొన్నారు. 2016-17 సంవత్సరంలో రెవెన్యూ అధికారులు నిర్వహించిన ఎంజాయ్‌మెంట్ సర్వేలో తన పేరు వచ్చిందని, రెవెన్యూ అధికారులు చెక్కులపై తన సంతకాలు తీసుకుని మూడు నెలల్లో భూ పరిహారం వస్తుందని చెప్పారని తెలిపారు. అప్పటి నుంచి పరిహారం కోసం ఎదురు చూస్తున్నానని, ఐదేళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్న ఎవరు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన పేరుపైన వచ్చిన భూ పరిహారాన్ని ఇంతకు ముందు హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయంలో పనిచేసిన రెవెన్యూ అధికారి కొండల్‌రెడ్డి తీసుకున్నట్లు తెలిసిందని ఆరోపించారు. తన తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతి చెందారని, తన సోదరి వివాహం చేయడంతో అప్పుల పాలయ్యానని, ఉన్న భూమి గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైందని కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇప్పటికైనా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి తనకు రావాల్సిన భూ పరిహారాన్ని ఇప్పించి ఆదుకోవాలని సంపత్ కోరారు.



భూనిర్వాసితుడు సంపత్ నుంచి పురుగుల మందు డబ్బాను లాక్కుంటున్న తహసీల్దార్ అనంతరెడ్డి

నిల్వ ఉన్న మద్యం తాగి ఇద్దరికి అస్వస్థత

- హైదరాబాద్‌లో చికిత్స.. పరిస్థితి విషమం
- మద్యంలో కలిసిన పురుగుల మందు

జగదేవ్‌పూర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి) : పశువులపాకలో ఉన్న మద్యం తాగి ఇద్దరు వ్యక్తులు అస్వస్థతకు గురైన సంఘటన జగదేవ్‌పూర్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో చోటుచేసుకున్నది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనకు సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన నిరుగంటి నర్సింలు, కొట్టాల కనకయ్య కలిసి ఐదు రోజుల క్రితం నర్సింలు పశువుల పాకలో ఎవరో దాచి (నిల్వ ఉంచిన) మద్యంను తాగారు. తాగిన రెండు మూడు రోజులకు శరీరంపై దద్దుర్లు రావడంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారి పరిస్థితి విషమంగా ఉండడంతో వారి రక్త నమూనాలు పరీక్షలు నిర్వహించగా మద్యంలో పురుగులమందు కలిపినట్లు తేలింది. దీంతో ఇద్దరి కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులే మద్యంలో పురుగుల మందు కలిపారని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

సైలెన్సర్‌ను మార్చితే కఠిన చర్యలు

- సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్

సిద్దిపేట క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : వాహనాల సైలెన్సర్ మార్ఫింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వాహనాలను తనిఖీ నిర్వహించగా అధిక శబ్ధం చేసే 53 వాహనాల సైలెన్సర్లను సీజ్ చేశామని తెలిపారు. వాటిని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో రోడ్డు రోలర్‌తో తొక్కించామన్నారు. కొంతమంది యువకులు బైక్‌లకు అధిక శబ్ధం వచ్చే సైలెన్సర్లను వాడి భయాందోళనకు గురిచేస్తున్నారన్నారు. సాయంత్రం సమయంలో కోమటిచెరువు, ఇక్బాల్ మినార్, నాసర్‌పుర, రంగనాయక సాగర్, బైపాస్ రోడ్ల వెంబడి రైడ్ చేస్తున్నారని వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. అనంతరం సిద్దిపేట బస్టాండ్ వద్దనున్న ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కల్పించారు.



రోడ్డు రోలర్‌తో సైలెన్సర్‌లను తొక్కిస్తున్న దృశ్యం

నారు గుంజుతూ పొలంలో పడి రైతు మృతి



తలారి కృష్ణ (ఫైల్)

కౌడిపల్లి, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి): పొలంలో నారు గుంజుతున్న క్రమంలో కిందపడి ఓ రైతు మృతిచెందిన సంఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండల పరిధిలో మంగళవారం చోటుచేసుకున్నది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వెంకటపూర్(బి) గ్రామానికి చెందిన తలారి కృష్ణ(45) తన పొలంలో మంగళవారం వరి నాట్లు వేస్తున్నారు. ఈ క్రమంలో సంచిలో నారును వేసుకుని పొలం గట్టుపై నుంచి తీసుకువస్తున్న క్రమంలో అకస్మాత్తుగా కాలు జారి పొలం మడిలో పడిపోయాడు. వెంటనే పైకి లేవడానికి రాకపోవడంతో బురద నీటిని మింగడంతో ఊపిరాడక స్పృహ కోల్పోయాడు. అక్కడున్న వారు కాస్త ఆలస్యంగా గమనించి గట్టుమీదకు తీసుకురాగా అప్పటికే మృతి చెందాడు. ఈమేరకు కృష్ణ భార్య వినోద ఫిర్యాదు మేరకు కౌడిపల్లి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన మహిళ.. నల్లవల్లి అటవీ ప్రాంతంలో శవమై



కేతువత్ మనీ(ఫైల్)

గుమ్మడిదల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : అదృశ్యమైన మహిళ గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలోని నల్లవల్లి అటవీ ప్రాంతంలో శవమై లభ్యమైనట్లు ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథన ప్రకారం.. కౌడిపల్లి మండల ప్రాంతానికి చెందిన కేతువత్ మనీ(38) ఈనెల 28న గుమ్మడిదలకు అడ్డా కూలి పనికి వచ్చి తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆమె భర్త కేతువత్ రాజు చుట్టుపక్కల ప్రాంతంలో, బంధువులు ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. గుమ్మడిదల పోలీసుల ద్వారా సీసీ కెమెరాల ఫుటేజీలను చూసినా జాడ కనిపించలేదు. దీంతో కౌడపల్లి పోలీస్‌స్టేషన్‌లో మనీ భర్త కేతవత్ రాజు ఫిర్యాదు చేశారు. అయితే 31 నాడు గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలోని నల్లవల్లి అటవీ ప్రాంతంలో ఓ మహిళా శవం లభ్యమైందని పోలీసులు ఫోన్ ద్వారా రాజుకు సమాచారం అందించడంతో అక్కడికి బంధువులతో కలిసి వెళ్లి చూడగా తన భార్య మనీ గా గుర్తించాడు. గుర్తుతెలియని వ్యక్తులు తన భార్యను అడవిలోకి తీసుకెళ్లి హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అర్చక, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- కారుణ్య నియామకాలు చేపట్టాలి
- 6042 ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు పే స్కేలు అమలు చేయాలి
- తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేందర్‌శర్మ

చేర్యాల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని 16 దేవాలయాల అర్చక, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేందర్‌శర్మ డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న ఆలయంలో మంగళవారం నిర్వహించిన ఈవో బాలాజీశర్మ ఉద్యోగ విరమణ వీడ్కోలు కార్యక్రమానికి ఆయన హాజరై అర్చకులతో కలిసి వేద ఆశీర్వచనమందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారుణ్య నియామకాలు పూర్తిస్థాయిలో చేపట్టాలని, దూప, దీపనైవేద్యం పథకం పేరు తొలగించి గ్రామీణ ప్రాతంలో 6042 దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకులను క్యాడర్ స్ట్రెంత్ ఏర్పాటుచేస్తూ పే-స్కేలు అమలు జరపాలని కోరారు. అర్చక వెల్ఫేర్ బోర్డు ద్వారా ఆదుకోవాలని కోరారు. కొమురవెల్లి మల్లన్న ఆలయ అభివృద్ధికి పాటుపడిన ఈవో బాలాజీశర్మ అందించిన సేవలు ఎనలేనివన్నారు. దేవాదాయశాఖలో నాలుగు దశాబ్ధాలపాటు ఈవో బాలాజీశర్మ నిబద్ధత తో పనిచేస్తూ ఆలయాల అభివృద్ధికి కృషిచేశారన్నారు. మల్లన్న ఆలయాభివృద్ధిలో తన దైన ముద్ర వేసుకున్న బాలాజీశర్మకు దైవాశీస్సులు వెన్నంటే నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట అర్చక సమాఖ్య అధ్యక్షుడు కలకుంట్ల వెంకటనరసింహాచార్యులు, మత్రైక సంఘం అధ్యక్షుడు కృష్ణమాచార్యులు, తెలగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి, మల్లన్న ఆలయ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, అర్చక సంఘం అధ్యక్షుడు పడిగన్నగారి ఆంజనేయులు, స్థానాచార్యుడు పడిగన్నగారి మల్లయ్య, అర్చకులు ఆకుల విజయ్, మహదేవుని రవి, మహదేవుని మనోహర్, మహదేవుని సాంబయ్య, బసవేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



ఈవో బాలాజీశర్మను గజమాలతో సత్కరిస్తున్న అర్చకులు

గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి


కిష్టయ్య(ఫైల్)

గజ్వేల్ రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన గజ్వేల్ మండలంలోని ధర్మారెడ్డిపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారెడ్డిపల్లికి చెందిన నుంచు కిష్టయ్య(55) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై కూలీ పని కోసం గజ్వేల్‌కి వచ్చాడు. రాత్రి ఇంటికి తిరిగి వెళ్తున్న క్రమంలో ఔటర్‌రింగ్ రోడ్డు వద్ద డివైడర్‌ను ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు దగ్గర్లోని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ములుగు మండలంలోని లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్న క్రమంలో మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పురుగులమందు తాగిన వ్యక్తి...

మద్దూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తితో గడ్డి మందు తాగిన వ్యక్తి చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎస్ఐ షేక్‌మహబూబ్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జాలపల్లి గ్రామానికి చెందిన బందారం మల్లేశం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో ఎడమ కాలును తొలగించారు. దీంతో అతడు ఇంట్లోనే ఉంటున్నాడు. ఇందుకు ఆర్థిక ఇబ్బందులు తోడవడంతో జీవితంపై విరక్తి చెందాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడగా గమనించిన కుటుంబీకులు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మల్లేశం మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనారోగ్య సమస్యలతో వ్యక్తి బలవన్మరణం


మల్లేశం(ఫైల్)

బెజ్జంకి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వ్యక్తి ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని గుండారంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకున్నది. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండారం గ్రామానికి చెందిన తాళ్లపల్లి మల్లేశం (55) కొంత కాలంగా పచ్చ కామెర్ల వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో అతడు మద్యానికి బానిసయ్యాడు. మల్లేశం భార్య భాగ్యలక్ష్మి కూలీ పనులకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చేసరికి మల్లేశం ఇంట్లో దూలానికి ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. పరిశీలించగా అప్పటికే మృతి చెందిఉన్నాడు. మృతుడి కుమారుడు సంజీవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి వెల్లడించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

చేర్యాలలో గంజాయి పట్టివేత..యువకుడి అరెస్ట్

చేర్యాల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న స్థానిక యువకుడిని పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీను తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ నిందితుడి వివరాలను వెల్లడించారు. చేర్యాలకు చెందిన దూడెం శ్రీధర్ డీజే ఆపరేటర్ పనితో పాటు ఇతరత్రా పనులు చేస్తున్న క్రమంలో హైదరాబాద్‌లో ఉంటున్న స్థానిక స్నేహితుడి సహాయంతో చేర్యాలకు గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్నట్టు తెలిపారు. ఈ విషయమై పక్కాసమాచారం మేరకు మంగళవారం సీఐ టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి స్థానిక యాదవనగర్‌కాలనీ సమీపంలో గంజాయి విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 490గ్రాముల గంజాయితో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ మేరకు కేసునమోదు చేసి శ్రీధర్‌ను రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు.

పొలంలో గడ్డి మందు చల్లిన వారిపై ఫిర్యాదు

మద్దూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాగిళ్లాపూర్‌లో తమ వరిపొలంలో నిమ్మ అనిత శ్రీనివాస్‌రెడ్డి దంపతులు కూలీల చేత గడ్డి మందు చల్లించారని మ్యాక మాధవి అనే మహిళ మంగళవారం మద్దూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వరి పొలంలో చల్లిన గడ్డిమందు ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, విచారణ కోసం ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి... నలుగురి అరెస్ట్

జగదేవ్‌పూర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిగుల్ గ్రామంలో పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురిని అరెస్టు చేసి, నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిగుల్ గ్రామంలో కొందరు పేకాడుతున్న పోలీసులకు విశ్వసనీయంగా సమాచారమందింది. ఈ మేరకు సోమవారం రాత్రి పేకాటస్థావరంపై పోలీసులు దాడి చేసి నలుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారినుంచి రూ. 80వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ వివరించారు.




హుస్నాబాద్‌లో ముగ్గులు కొనుగోలు చేస్తున్న మహిళలు, కేక్‌లు విక్రయించే షాప్ వద్ద యువకుల సందడి, చేర్యాల పట్టణంలో బేకరీ వద్ద కేక్‌ల విక్రయాలు

జిల్లాలో న్యూ ఇయర్ సందడి


చిన్నకోడూరు మండల కేంద్రంలో వెలసిన న్యూఇయర్ కేక్‌ల షాపు


మద్దూరులో న్యూఇయర్ సందర్భంగా వెలసిన షాపులో కేక్ కొనుగోలు చేస్తున్న గ్రామస్థుడు


హుస్నాబాద్‌లో కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ తామరపుష్పం ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

జిల్లావ్యాప్తంగా ఆయా మండలాల్లో నూతన సంవత్సర సందడి నెలకొన్నది. బేకరీలు, రంగుల దుకాణాలు, మద్యం షాపులు, మాంసం దుకాణాలు మంగళవారం జనంతో కిటకిటలాడాయి. ఇళ్ల ముందు ముగ్గులు వేసేందుకు రోడ్ల పక్కన వెలసిన రంగుల దుకాణాల వద్ద మహిళలు బారులు తీరి, వివిధ రకాల రంగులను కొనుగోలు చేశారు. నూతన సంవత్సర కేక్‌లను కొనుగోలు చేసేందుకు యువతీ యువకులు ఆసక్తి చూపారు. బేకరీ దుకాణాల్లో ప్రత్యేక ఆఫర్లతో జోరుగా కేకులను విక్రయించారు. పలువురు ఆయా పట్టణ, గ్రామశివార్లలోని ఫాంహౌజ్‌లలో మిత్రులతో కలసి ఆడి,పాడి ఆనందోత్సాహాలు జరుపుకున్నారు. కాగా డిసెంబర్ 31 వేడుకలు శృతి మించకుండా పోలీసులు పలుచోట్ల బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ఆంక్షలు విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిని, అల్లరి చేసే పోకిరీలపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. హుస్నాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ హైస్కూల్‌లో విద్యార్థులు మంగళవారం కొత్త సంవత్సరానికి వినూత్నరీతిలో ఆహ్వానం పలికారు. విద్యార్థులు 2025 ఆకారంలో కూర్చుని ముందస్తుగా కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. అదేవిధంగా బురదలో నుంచి వికసించే తామర పుష్పం ఆకారంలో ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నారు.

- న్యూస్ నెట్‌వర్క్, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి)


బంగారు పతకం గెలుచుకున్న మనిషా

సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణం

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సరూర్ నగర్‌లో జరుగుతున్న సీఎం కప్ రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో సిద్దిపేట జిల్లా విద్యార్థిని మనిషా బంగారు పతకం సాధించింది. రిథమిక్ యోగాసన సీనియర్ విభాగంలో పతకం వచ్చినట్లు యోగాసన స్పోర్ట్స్ జిల్లా అధ్యక్షుడు అశోక్ తెలిపారు.

పీఆర్‌టీయూ టీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

చేర్యాల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : పీఆర్టీయూ టీఎస్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో చేర్యాల ఎంఈవో రచ్చ కిష్టయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ మండలాధ్యక్షుడు కేవీఎన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రభాకరరెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు టి. పరమేశ్వరయ్య, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా గంగపుత్ర సంఘం క్యాలెండర్..

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఉమ్మడి మెదక్ జిల్లా గంగపుత్ర సంఘం నూతన క్యాలెండర్‌ను జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ డైరెక్టర్లు కనకరాజు, వేంకటేశ్వరులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల తనిఖీ

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం డీఐఈవో రవీందర్‌రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడి అధ్యాపకుల బోధన తీరుపై ఆరా తీశారు.

డ్రగ్స్ నిర్మూలన పోస్టర్ ఆవిష్కరణ

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ నిర్మూలనకు సంబంధించిన పోస్టర్లను సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ సునీత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ ఉత్తమ సమాజ నిర్మాణానికి ఆరోగ్యవంతమైన యువత అవసరమన్నారు. డ్రగ్స్ వల్ల జరిగే అనర్థాల పట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

జగదేవ్‌పూర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగస్తుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు అక్కారం సత్తయ్య, ప్రధాన కార్యదర్శి పోచయ్య, జిల్లా నాయకుడుశంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ20 రోజుల నుంచి సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె వల్ల కేజీబీవీలో విద్యాబోధన లేక తరగతులు ఆగిపోయినట్లు చెప్పారు. ప్రభుత్వం స్పందించి సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధిలో అధోగతి: బీఆర్ఎస్

సిద్దిపేట టౌన్, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అభివృద్ధిలో బంగారు తెలంగాణగా ఉన్న రాష్ట్రం, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నేరాల, ఘోరాల తెలంగాణగా మార్చే ప్రయత్నం చేస్తున్నదని ఏడాది పాలన ద్వారా అర్థమవుతుందని ఏఎంసీ మాజీ చైర్మన్ పాల సాయిరాం విమర్శించారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు భూపేష్‌తో కలిసి పాల సాయిరాం మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో భద్రత కరువైందన్నారు. ఈ ప్రభుత్వంలో ప్రతిపక్షాల మీద, కాంగ్రెస్ కు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్న జర్నలిస్టుల మీద నిఘా నేత్రాలు పని చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రజలకు భరోసా కల్పించడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మొహీజ్, శ్రీకాంత్ గౌడ్, సయ్యద్, ఆంజనేయులు, బాబ్ జాని, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

చేర్యాల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావదినోత్సవాన్ని కొమురవెల్లిమండలకేంద్రంలో ఆ యూనియన్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా యూనియన్ డివిజన్ కార్యదర్శి తాడూరి భరత్‌కుమార్ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారంలో ఎస్ఎఫ్ఐ అగ్రగామిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో నాయకులు తాడూరి ప్రకాశ్, రాఘవ, చందు, భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్, మత్తు పదార్థాల నిషేధంపై
అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రయాణాలు, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాల నిషేధంపై అన్ని శాఖలు సమన్వయంతో అవగాహన సదస్సులను నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ పేర్కొన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో రోడ్డు భద్రతాకమిటీ మత్తుపదార్థాల వినియోగ నివారణకు సంబంధిత పలు శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో డ్రగ్స్ సరఫరా, వినియోగాన్ని పూర్తిగా అంతం చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. అంగన్‌వాడీలలో మదర్స్ కమిటీల్లో డ్రగ్స్ బారిన పడితే పిల్లలు ప్రవర్తించే తీరును తెలుపుతూ పిల్లల ప్రవర్తనలో తేడా వస్తే వెంటనే అధికారుల దృష్టికి తెచ్చేలా సమావేశాలు నిర్వహించాలని డీడబ్ల్యూవో అధికారులకు తెలిపారు. సోషల్ మీడియాలో డ్రగ్స్ అవేర్నెస్ వీడియోలు, ఫొటోలతో ప్రచారం చేయాలని సూచించారు. విద్యాసంస్థల్లో డ్రగ్స్ వంటి మత్తుపదార్థాల వినియోగంపై అవగాహన సదస్సులను నిర్వహించాలన్నారు. రహదారుల డ్రంకెన్‌డ్రైవ్, మైనర్ డ్రైవింగ్ కేసులపై అధికారులు కఠినంగా వ్యవహరించడం మాత్రమే కాకుండా, కౌన్సెలింగ్ కూడా ఇవ్వాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఆర్టీసీ, పోలీస్ సిబ్బంది సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈఈ బి.మనోహర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస మూర్తి, ఏసీపీ మధు, జిల్లా వైద్యాధికారి డా. పల్వాన్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదు: డీపీవో


రాజలింగంను గజమాలతో సత్కరిస్తున్న ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు

మర్కుక్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదని సిద్దిపేట జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి అన్నారు. మర్కుక్ మండల పంచాయతీ అధికారిగా విశేష సేవలు అందించి పదవీ విరమణ పొందుతున్న రాజలింగం వీడ్కోలు సమావేశాన్ని ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ పదవిలో ఉండగా ప్రజలకు చేసిన సేవలే శాశ్వతంగా నిలిచిపోతాయని చెబుతూ రాజలింగం అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రంగమ్మ రామచంద్రం, సిద్దిపేట జిల్లా ప్రత్యేక అధికారి స్వామిగౌడ్, సిద్దిపేట జిల్లా అడిషనల్ డీఆర్డీవో బాలకృష్ణ, గజ్వేల్ డీఎల్పీవో లత, మర్కుక్ తహసీల్దార్ అరిఫా, ఎంపీడీవో అబ్దులుద్దీన్, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో చేసిన సేవలే శాశ్వతం


సీహెచ్‌వో జాకీర్‌హుస్సేన్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

సిద్దిపేట రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విధి నిర్వహణ కాలంలో చేసిన మంచి పనులే శాశ్వతంగా నిలిచిపోతాయని తెలంగాణ మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ హెచ్ వన్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కర్నాటి సాయిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండలం చింతమడక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన మహ్మద్ జాకీర్ హుస్సేన్ ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో జాకీర్ హుస్సేన్ చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సిద్దిపేట ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, చింతమడక వైద్యాధికారి డాక్టర్ భాస్కర్, సిబ్బంది, జిల్లా వైద్యశాఖ సిబ్బందితో పాటు ఇతర జిల్లాల అధికారులు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది: ఎమ్మెల్సీ


సుధాకర్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ

చిన్నకోడూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి సమాజంలో ఉన్నతమైనదని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చంద్లాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కోడూరు సుధాకర్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేశారంటూ ఉపాధ్యాయుడు సుధాకర్‌ను ఆయన కొనియాడారు. అనంతరం సుధాకర్ దంపతులను సన్మానించి మెమెంటోను అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఏంఈవోలు యాదవరెడ్డి, దేశిరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, పలు ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలి

కోహెడ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు పనిచేస్తూనే ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేయాలని సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ తడిసిన రాజశేఖర్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. మంగళవారం కోహెడ మండలం తంగళ్లపల్లి గ్రామంలో ఆయన బీజేపీ జెండాను ఎగురవేశారు. అనంతరం స్థానిక కృష్ణస్వామి గుట్టపై ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా బూత్ అధ్యక్షులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, మండల ప్రధానకార్యదర్శి పిల్లి నర్సయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలి

ములుగు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికీ సంక్షేమ పథకాలతో పాటు రుణ సదుపాయం కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య అన్నారు. మంగళవారం భవన నిర్మాణ కార్మిక సంఘం మామిడాల గ్రామంలో ఆయన సీఐటీయూ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో స్థానిక మేస్త్రీలు, కూలీలకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూపాల్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎడ్ల పోచయ్య, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి ఉత్తములుగా ఎదగాలి

చేర్యాల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాలను గుర్తుంచుకుని క్రమశిక్షణతో రాణించి ఉత్తములుగా ఎదగాలని చేర్యాల సీఐ శీను పేర్కొన్నారు. మండలకేంద్రంలోని నర్మెట్ట గురుకుల బాలికల పాఠశాలలో మంగళవారం పోలీసులు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలు, గుడ్,బ్యాడ్‌టచ్, నూతన చట్టాల పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ ఎల్. శ్రీను మాట్లాడుతూ ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌లకు పాల్పడితే చర్యలు తప్పవని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మన్విచంద్, ఉపాధ్యాయులు, షీటీమ్ బృందం పాల్గొన్నారు.